

కంది మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడాలి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కంది, జూన్ 20: గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. ఎంపీపీ సరళాపుల్లారెడ్డి అధ్యక్షతన గురువారం కంది మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని, కాంగ్రెస్ సైతం సకాలంలో నిధులు విడుదల చేసి అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులకు సూచించారు. మండల సమస్యలపై వారంలో అన్ని శాఖల అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీపీ సరళా పుల్లారెడ్డి, జడ్పీటీసీ కొండల్‌రెడ్డి మాట్లాడుతూ తమ ఐదేండ్ల పదవీ కాలంలో అభివృద్ధే లక్ష్యంగా పని చేశామన్నారు. ఎంపీటీసీలు, జడ్పీటీసీల చివరి సమావేశం కావడంతో ఎమ్మెల్యే వారిని శాలువాలతో సన్మానించారు. సమావేశంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కాసాల బుచ్చిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాంరెడ్డి, కృష్ణగౌడ్, శంకర్‌గౌడ్, పలు శాఖల అధికారులు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సీజీఆర్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

గుమ్మడిదలలో వైకుంఠరథాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, తదితరులు

గుమ్మడిదల, జూన్ 20: సీజీఆర్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గుమ్మడిదల మండల కేంద్రంలో ఆ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా యువ నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి తన సీజీఆర్ ట్రస్ట్ సౌజన్యంతో రూ.2 లక్షల సొంత నిధులతో వైకుంఠరథాన్ని, గ్రామంలోని ప్రధాన కూడళ్లలో 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని ఆదనపు కలెక్టర్ తహసీల్దార్ గంగాభవాని, జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి అఖిలేశ్‌రెడ్డి, సీజీఆర్ ట్రస్ట్ వైస్ చైర్మన్ చిమ్ముల నరేందర్ రెడ్డి, ఈవో రాములు, మద్దుల బాల్‌రెడ్డి, సత్యనారాయణ, సూర్యనారాయణ భాస్కర్, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, మొగులయ్య, ఆంజనేయులు యాదవ్ పాల్గొన్నారు.

ఏటీఎం కార్డుల దొంగ అరెస్ట్

వెంకటకోటేశ్వర్‌రావు

రామచంద్రాపురం, జూన్ 20: ఏటీఎంల వద్ద డబ్బులు డ్రా చేసుకోవడానికి వచ్చే వారిని టార్గెట్ చేసుకొని వారి దృష్టిని మళ్లించి దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని ఆర్సీపురం పోలీసులు అదుపులోని తీసుకొని గురువారం రిమాండ్‌కు తరలించారు. ఆర్సీపురం పీఎస్ డీఐబి.సంజీవులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లాకు చెందిన వెంకటకోటేశ్వర్‌రావు సాయితిరుమల దవాఖాన సర్సారావుపేటలో వార్డ్‌బాయ్‌గా పని చేస్తున్నాడు. ప్రస్తుతం కేపీహెచ్‌బీలోని బాలాజీ బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. వెంకటకోటేశ్వర్‌రావు ఏటీఎంల వద్దకు డబ్బులు డ్రా చేసుకునేందుకు వచ్చే వృద్ధులను టార్గెట్ చేసుకొని వారు డబ్బులు డ్రా చేసే సమయంలో ఏటీఎం పిన్ నంబర్‌ని తెలుసుకుంటాడు. ఆ తర్వాత వారిని మాటల్లో పెట్టి వారికి తెలియకుండానే ఒరిజినల్ కార్డుని తీసుకొని తన వద్ద ఉన్న నకిలి ఏటీఎం కార్డుని వారికి ఇస్తాడు. అక్కడినుంచి వారు వెళ్లిపోయిన తర్వాత ఆ కార్డుని తీసుకొని ఏటీఎం నుంచి డబ్బులు డ్రా చేసుకుంటాడు. ఈ నేపథ్యంలో 10వ తేదీన పటాన్‌చెరుకు చెందిన కొల్కురి నర్సింహారెడ్డి భార్య తరునమ్‌రెడ్డి మధ్యాహ్నం 2గంటలకు రామచంద్రారెడ్డినగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం నుంచి రూ.20వేలు చొప్పున రూ.40వేలు డ్రా చేసి డబ్బులు లెక్కిస్తూ మిషన్ నుంచి ఏటీఎం కార్డు తీయలేదు. అదే సమయంలో అక్కడే ఉన్న వెంకటకోటేశ్వర్‌రావు ఏటీఎంలోకి వెళ్లి ఆమె కార్డుని తీసి తన వద్ద ఉన్న నకిలీ కార్డు ఆమెకు ఇచ్చాడు. దీంతో అక్కడి నుంచి ఆమె వెళ్లిపోయింది. సరిగ్గా మధ్యాహ్నం 3 నుంచి 3.30గంటల మధ్యలో నిందితుడు ఆ కార్డుతో సంగారెడ్డిలోని షిరిడీ సాయి ఆటో షోరూంలో వినియోగించి రూ.40వేలు డ్రా చేశాడు. ఆమె ఫోన్‌కి డబ్బులు డ్రా అయినట్టు మేసేజ్ వచ్చింది. దీంతో తేరుకున్న ఆమె తనవద్ద ఉన్న ఏటీఎం కార్డు నకిలీదని గమనించి భర్త నర్సింహారెడ్డితో కలిసి ఆర్సీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వెంకటకోటేశ్వర్‌రావుని కేపీహెచ్‌బీలో గురువారం అదుపులోకి తీసుకొని విచారించి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు ఆర్సీపురంతోపాటు నిజామాబాద్, వరంగల్, షాద్‌నగర్, సిద్దిపేట, జోగిపేటలో ఏటీఎంల వద్ద నేరాలకు పాల్పడ్డాడని డీఐ సంజీవులు తెలిపారు. క్రైం డీఎస్ఐ నర్సింహా తదితరులు ఉన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, జూన్ 20: ఆర్సీపురం డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని సాయినగర్‌కాలనీలో రూ.20లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కాలనీకి సమాన ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి చేస్తున్నామన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలో డివిజన్ అభివృద్ధికి కోట్లాది రూపాయలు తీసుకువచ్చినట్లు తెలిపారు. తొంభై శాతం అభివృద్ధి పనులు బీఆర్ఎస్ హయాంలో జరిగాయన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, రవికిరణ్‌గౌడ్, యాదిరెడ్డి, భాస్కర్, పండరి, గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రమేశ్ ఉన్నారు.

సుందరమ్మతల్లి జాతర

బోనాలతో వెళ్తున్న మహిళలు

హత్నూర, జూన్ 20: హత్నూరలోని సుందరమ్మతల్లి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన భక్తులు సాయంత్రం పెద్దఎత్తున బోనాల ఊరేగింపు నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాల మధ్య బోనాల ఊరేగింపు కొనసాగింది. శుక్రవారం ఆలయం వద్ద బండ్ల ఊరేగింపు ఉంటుందని, శనివారం పాచిబండ్ల ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మామిడ్గిలో డెంగీ కలకలం!

- బీదర్‌లో పలువురికి చికిత్స
- గ్రామంలో లోపించిన పారిశుధ్యం
- మరమ్మతులకు నోచుకోని పైపులైన్లు
- అప్రమత్తమైన మిర్జాపూర్(బి) పీహెచ్‌సీ
- ప్రత్యేక శిబిరాల ఏర్పాటు



డెంగీ బాధితుల వివరాలు తెలుసుకుంటున్న వైద్యాధికారులు

న్యాల్‌కల్, జూన్ 20: మండలంలోని మామిడ్గి గ్రామంలో డెంగీ ప్రబలింది. జ్వరంలో బాధపడుతున్న పలువురు కర్ణాటక రాష్ట్రం బీదర్‌లోని ప్రైవేటు దవాఖానకు వైద్యం కోసం వెళ్తే డెంగీ అని తేలింది. విషయం తెలుసుకున్న మిర్జాపూర్(బి) పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. గురువారం గ్రామాన్ని సందర్శించారు. స్థానిక వైద్యాధికారులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బింధురెడ్డి, శైలందర్‌రెడ్డి జ్వరంతో బాధపడుతూ వైద్యం కోసం బీదర్‌లోని ప్రైవేటు దవాఖానకు వెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలు చేయడంతో డెంగీ అని తేలింది. స్థానిక వైద్యాధికారులు స్పందించి వెంటనే డెంగీ సోకిన వ్యక్తికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ప్రస్తుతం ఇరువురు కోలుకున్నారని వైద్యాధికారులు తెలిపారు. ఇప్పటికే గ్రామానికి చెందిన మరో నాలుగురు వ్యక్తులకు డెంగీ సోకగా చికిత్స పొందారు. గ్రామంలో పారిశుధ్య పనులు లోపించడంతోపాటు పలు వార్డుల్లో తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలతోనే డెంగీ సోకడానికి కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వారం రోజులుగా వీధుల్లో పోగైన చెత్తాచెదారాన్ని ట్రాక్టర్‌లో తీసుకెళ్లడం లేదన్నారు. డ్రైనేజీలు చెత్తతో నిండి కంపుకొడుతున్నాయని వాపోతున్నారు. ఫలితంగా దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తుండంతో వ్యాధుల భారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పడకేసిన 'ప్రత్యేక' పాలన

గ్రామాల్లో పాలన పడకేసింది. ప్రత్యేకాధికారితోపాటు పంచాయతీ అధికారి చుట్టపు చూపుగా వచ్చిపోతున్నారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మిర్జాపూర్(బి) వైద్యాధికారులు, సిబ్బంది గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టి వివరాలు సేకరించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి మందులను పంపిణీ చేశారు. ఎవరికైనా తీవ్రమైన జ్వరం ఉంటే వెంటనే మిర్జాపూర్(బి) సీహెచ్‌సీకి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

చెత్తాచెదారంతో నిండిన డ్రైనేజీలు

కంది: ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

బొల్లారం: మాత్రలు వేస్తున్న డాక్టర్ రాధిక, పక్కన మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

జిల్లా వ్యాప్తంగా గురువారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఒకటి నుంచి 19 ఏండ్ల పిల్లలకు మాత్రలు వేశారు. నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఆయా శాఖల అధికారులు, స్థానిక నాయకులు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కంది జడ్పీహెచ్ఎస్‌లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూన్ 20

అందోల్: విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

గుమ్మడిదల: విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యులు

రామచంద్రాపురం: మాత్రలు వేస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

నాణ్యమైన విద్యను అందించాలి

అల్లాపూర్ బాలికల గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీపీ మొగులప్ప, ఎంపీడీవో ఎంఎం షరీఫ్

రాయికోడ్, జూన్ 20: సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యను అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నదని ఎంపీపీ మొగులప్ప అన్నారు. గురువారం మండల పరిధిలోని అల్లాపూర్ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు నాణ్యమైన విద్యతోపాటు మంచి భోజనం అందించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో ఎంఎం షరీఫ్, మండల స్థాయి అధికారులు రమేశ్, విష్ణుసాగర్, తుక్కప్ప ఉన్నారు.

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు

వట్‌లపల్లి, జూన్ 20: ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కేటాయించిన నిధులను బ్యాంక్ అధికారులు రుణాల కింద జమచేసి రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని మండల వ్యవసాయ అధికారి మహేశ్‌చౌహాన్ బ్యాంక్ అధికారులకు సూచించారు. మండల పరిధిలోని ఏపీజీవీబీ బ్యాంక్‌లో రైతు బంధు, రైతు బీమా, పింఛన్ల తరపున వచ్చిన డబ్బులను రుణాల కింద జమ చేస్తున్నారని వచ్చిన సమాచారంతో ఏవో గురువారం బ్యాంక్ అధికారులకు లేఖ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసిన డబ్బులను రుణాల కింద జమ చేయడం సరికాదన్నారు. ఏఈవో మానిక, సింబ్బంది ఉన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

కల్హేర్, జూన్ 20: రైతులు అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో రసాయన ఎరువులు అధికంగా వాడడం భూ సాంద్రతకు ముప్పు అని ఏడీఏ నూతన్‌కుమార్ అన్నారు. గురువారం కృష్ణాపూర్‌లో రైతులతో మాట్లాడారు. భూసారం తగ్గకుండా చూడాలంటే పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము, పిల్లిపెసర తొలకరి వర్షాలు పడినప్పుడు వేసినట్లయితే భూసారం పెరుగుతుందన్నారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారి కృష్ణవేణి ఉన్నారు.

కేతకీని సందర్శించిన అదనపు ఎస్పీ

కేతకీలో ప్రత్యేక పూజలు చేస్తున్న అదనపు ఎస్పీ సంజీవరావు

ఝరాసంగం, జూన్ 20: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో అదనపు ఎస్పీ సంజీవరావు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛరణ మధ్య వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలోని అమృత గుండంలో జలలింగాన్ని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీసమేత సంగమేశ్వర స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు అదనపు ఎస్పీని పూలమాల, శాలువతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఝరాసంగం ఎస్ఐ రాజేందర్ రెడ్డి, ఆలయ అధికారులు, అర్చక బృందం తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

రూ.2 లక్షల చెక్కును అందచేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, జూన్ 20: బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటూ ఆదుకుంటుందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. నారాయణఖేడ్ మండలం డీఎన్‌టీ తండాకు చెందిన కేతావత్ శంకర్‌నాయక్ ప్రమాదవశాత్తు ఇటీవల మృతి చెందడంతో రూ.2 లక్షల చుక్కు, రైతు బీమ పథకం ద్వారా రూ.5 లక్షల బ్యాంకు ఓచర్‌ను అతడి భార్య కేతవత్ దుర్గాబాయికి అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మీబాయి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు శేరి రామకృష్ణ, శేరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రవీందర్, కురుమ సంఘం తాలుక ఉపాధ్యక్షుడు మల్గొండ, పార్టీ గ్రామ అధ్యక్షుడు నారాయణ, నాయకులు హరినాయక్, శ్రీనివాస్ రెడ్డి, అనిల్‌గౌడ్, దస్తగిరి పాల్గొన్నారు.

'నీట్'పై సుప్రీం జడ్జితో విచారణ చేయాలి

సంగారెడ్డిలో ర్యాలీగా వెళ్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి, జూన్ 20: నీట్ రాసి నష్టపోయిన విద్యార్థులకు న్యాయం జరగాలంటే సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవన్ నుంచి కొత్త బస్టాండ్ వరకు సీపీఎం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ అవకతవకలపై బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బీరం మల్లేశం, అతిమేల మాణిక్, సాయిలు, నాయకులు యాదగిరి, అశోక్, కృష్ణ, శివకుమార్, సుధాకర్, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

నిధులను దుర్వినియోగం చేయొద్దు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

మనూరు, జూన్ 20: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన నిధులను దుర్వినియోగం చేయొద్దని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. గురువారం మనూరు ఎంపీపీ సమావేశ మందిరంలో ఎంపీడీఓ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. అతిమ్యాల్ గ్రామంలో నీటి సమస్య పరిష్కారం కోసం దోసపల్లి గ్రామం నుంచి పైప్‌లైన్ వేయాలన్నారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంవల్ల మండల పరిధిలోని కమలాపూర్ చెరువు కాల్వలకు మరమత్తులు చేపట్టి రైతులు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీటీసీల పదవీ కాలం ముగియడంతో ఎంపీటీసీలను ఎమ్మెల్యే శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అలివేలుమంగా, తహసీల్దార్ వెంకటస్వామి, విద్యుత్ శాఖ ఏఈ అశోక్‌రెడ్డి, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అన్నన్, ఏపీఓ వంశీకృష్ణ, ఏపీఓ ఇక్బాల్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫుట్‌బోర్డు ప్రయాణం ప్రమాదకరం

బొల్లారం, జూన్ 20: ప్రమాదకరమని తెలిసినా ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణం చేయడం మంచిది కాదని మియాపూర్ డిపో-2 మేనేజర్ వెంకటేశం అన్నారు. గురువారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఆర్టీసీ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రత్యేక తనిఖీల్లో భాగంగా మియాపూర్ డిపో నుంచి బొల్లారానికి వచ్చే ఆర్టీసీ బస్సులను, అందులో ప్రయాణించే ప్రయాణికులను గమనించారు. ఫుట్ బోర్డులో నిలబడి ప్రయాణం చేస్తున్న విద్యార్థులను, ప్రయాణికులను హెచ్చరించారు. బస్సు ఆగిన తర్వాతే ఎక్కాలని, కదులుతున్న బస్సుల్లోకి ఎక్కడం ప్రాణాలకే ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో మియాపూర్ డిపో-2 ఆర్టీసీ అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బోరంచ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మనూరు, జూన్ 20: బోరంచ నల్ల పోచమ్మ ఆలయ ఉత్సవాల్లో భాగంగా గురువారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మండల పరిధిలోని బోరంచ నల్ల పోచమ్మ అమ్మవారి ఏడు వారాల జాతర ముగుస్తున్నందున్న ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. ఆరో వారం జాతర కావడంతో మాజీ ఎమ్మెల్యే నల్ల పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

కుమ్మరికుంటను పరిశీలిస్తున్న నాయకులు

మునిపల్లి, జూన్ 20: భూ కబ్జాలకు పాల్పడుతూ రైతులను ఇబ్బంది పెడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని మేళ సంఘం గ్రామ శివారులోని కుమ్మరి కుంటను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మేళసంఘం శివారులోని కుమ్మరి కుంట కాల్వను మూసివేసిన రియన్ వ్యాపారులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముంబాయి జాతీయ రాహదారికి దగ్గర్లో ఉండడంతో భూకబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో రైతులు సంగమేశ్వర్, యాదగిరి, కృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాలపై దాడి

- 840 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం
- తొమ్మిది వాహనాలు పట్టివేత
- నలుగురి అరెస్ట్

గ్యాస్ రీఫిల్లింగ్ వ్యాపారం చేస్తున్న నిందితులను పట్టుకున్న పోలీసులు

పటాన్‌చెరు, జూన్ 20: ఎస్పీ రూపేశ్ ఆదేశాల మేరకు గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 840 గ్యాస్ సిలిండర్లు, తొమ్మిది గూడ్స్ వాహనాలను స్వాధీనం చేసుకొని నలుగురు నిందితులను అరెస్టు చేశారు. గురువారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో సబ్సిడీ గ్యాస్ సిలిండర్లతో కమర్షియల్ సిలిండర్లు నింపుతున్న కేంద్రాలపై దాడులు నిర్వహించారు. ఇస్నాపూర్ గ్రామ పరిధిలోని రోహన్ ట్రేడర్స్‌పై దాడి చేసి 73 ఫుల్ గ్యాస్ సిలిండర్లు, 661 ఖాళీ గ్యాస్ సిలిండర్లు, మొత్తంగా 734 గ్యాస్ సిలిండర్లు పట్టుకున్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లలో డొమెస్టిక్ గ్యాస్‌ను నింపి అధిక ధరకు అమ్ముతున్నారని గుర్తించి తిమ్మానగర్ రోడ్డు పిట్లంకు చెందిన బొక్క శ్రీనివాస్(46)ను అదుపులోకి తీసుకున్నారు. గ్యాస్ సిలిండర్లను పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఇస్నాపూర్‌లో 106 సిలిండర్లు పట్టివేత

ఇస్నాపూర్ సాయికాలనీలో మాదిరి రవీందర్(65) అక్రమ రీఫిల్లింగ్ కేంద్రం నడిపిస్తున్నాడని గుర్తించి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 3 తూకం మిషన్లు, 3 గ్యాస్ రీఫిల్లింగ్ మిషన్స్, 53 ఫుల్ గ్యాస్ సిలిండర్లు, 53 ఖాళీ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 106 గ్యాస్ సిలిండర్లు పట్టుబడ్డాయి. వీరితోపాటు అక్రమ సిలిండర్లను సరఫరా చేస్తున్న ఆటో డ్రైవర్లు రాజు, ప్రవీణ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ అక్రమ దందాను అడ్డుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులను ఎస్పీ రూపేశ్ అభినందించారు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేసినా, అక్రమంగా కమర్షియల్ సిలిండర్లలో నింపినా నేరమన్నారు. చిన్న సిలిండర్లలో నింపి అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.